క్లుప్తంగా

ప్రభుత్వ విప్‌కు సన్మానం

వేములవాడ: రాజన్న ఆలయ సమీపంలో జగద్గురు ఆది శంకరాచార్యుల 108 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు సంకల్పించినట్లు శ్రీ విశ్వ గురుసేన ట్రస్ట్ ప్రతినిధులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను ఆదివారం విజ్ఞప్తి చేశారు. ఆమేరకు వేములవాడలో ట్రస్టు నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ట్రస్టు ప్రతినిధులు ప్రభుత్వవిప్‌ను ఘనంగా సన్మానించారు.

దరఖాస్తులు ఆహ్వానం

సిరిసిల్లటౌన్: మహాత్మా జ్యోతిబాపులే పురుషుల గురుకుల కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎల్లారెడ్డిపేట ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ ప్రిన్సిపాల్ కే.వీరప్రభాకర్ ఆదివారం ఒక ప్రకటన తెలిపారు. 2024 సంవత్సరంలో పాసైన విద్యార్థులు స్పాట్ అడ్మిషన్స్ కోసం సంబంధిత ధ్రువపత్రాలతో ఈనెల31 లోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. రిజర్వేషన్లు, మెరిట్ ప్రకారం సీట్లు కేటాయించనున్నట్లు తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి గాను బీఎస్సీ (ఎంపీసీఎస్), బీఎస్సీ(బీజెడ్సీ), బీకామ్ (సీఏ), ఇంగ్లిష్ మీడియంలో ఖాళీలున్నట్లు తెలిపారు.

చెత్త తొలగింపు



కల్వర్టు వద్ద చెత్త తొలగిస్తున్న జీపీ సిబ్బంది

బోయినపల్లి: మండలకేంద్రం నుంచి వేములవాడ వెళ్లే బీటీరోడ్డులో ఉన్న లో లెవల్ కల్వర్టు పైపుల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించే పనులను ఎంపీడీవో బీమా జయశీల ఆదివారం పర్యవేక్షించారు. వర్షం కురిసిన ప్రతిసారి కల్వర్టుపై నుంచి భారీగా వరదనీరు వెళ్లడంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ఎంపీడీఓ జయశీల ముందు జాగ్రత్తగా పైపుల నుంచి నీరు సాఫీగా వెళ్లేందుకు పైపుల్లో పేరుకుపోయిన చెత్తను సిబ్బంది తొలగింపజేశారు. కార్యదర్శి రాజసులోచన తదితరులున్నారు.

ఆగస్టు 6 నుంచి ఆధ్యాత్మిక కార్యక్రమాలు

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని ప్రముఖ సత్సంగ సదనంలో ఆగస్టు 6 నుంచి 14 వరకు భక్త శ్రీ గోవిందరాజుల ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సదనం అధ్యక్షుడు బ్రహ్మచారి లక్ష్మారెడ్డి ఆదివారం తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన బ్రహ్మశ్రీ సంగిరాల రాజేంద్ర ప్రసాద్ శాస్త్రి గారిచే రామాయణాన్ని భక్తులకు వివరిస్తారన్నారు. కరీంనగర్, కామారెడ్డి, సిరిసిల్ల నుంచి వచ్చే భక్తులకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రెయిన్ కోట్స్ అందజేత



వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలంలోని వట్టెంలలో గ్రామ పంచాయతీ కార్మికులకు అదే గ్రామానికి చెందిన మంద శేఖర్‌గౌడ్ రెయిన్ కోట్లు అందజేశారు. వర్షంలో పనిచేస్తున్న కార్మికుల శ్రమను గుర్తించిన ఆయన సొంత ఖర్చుతో వారికి రెయిన్ కోట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

మత్తు పదార్థాలకు బానిస కావద్దు

వీర్నపల్లి: మండలంలోని ప్రజలు గుడుంబా, గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిస కావద్దని ఎస్సై ఎల్లయ్య గౌడ్ అన్నారు. ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎర్రగడ్డ తండా జవహర్‌లాల్ నాయక్ తండా, లాల్‌సింగ్ తండా, గొల్య నాయక్ తండ, బంజరుతండా గ్రామాలవారికి గుడుంబా వల్ల కలిగే నష్టాలపై కౌన్సెలింగ్ నిర్వహించారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏమైనా సమస్యలుంటే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు.

మూలనపడ్డ బతుకమ్మ చీరలు

గంభీరావుపేట: పేదింటి మహిళలకు బతుకమ్మ పండుగ కానుకగా అప్పటి ప్రభుత్వం చీరలను పంపిణీ చేసింది. ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో బతుకమ్మ చీరలు పంపిణీ ఆగిపోయింది. గంభీరావుపేట మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయంలోని స్టోర్ రూంలో కుప్పలు తెప్పలుగా బతుకమ్మ చీరల మూటలను మూలనపడేశారు. పేద మహిళలకు అందిస్తే ప్రయోజనకరంగా ఉంటుంది కానీ ఇలా పడేయడం ఏంటని పలువురు అధికారులను ప్రశ్నిస్తున్నారు.

చందాలతో అంత్యక్రియలు

తంగళ్లపల్లి: మండలంలోని చిన్న లింగాపూర్‌కు చెందిన టేకుమల్ల పోశయ్య (59) అనారోగ్యంతో మృతిచెందాడు. నిరుపేద కుటుంబం కావడంతో గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు, చందాలు పోగుచేసి ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడికి భార్య ఎల్లవ్వ, కూతురు శిరీష ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

కళాశాలలో సమస్యలెన్నో..



ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో పెరిగిన పిచ్చిమొక్కలు



బురదమయంగా కళాశాలకు వచ్చే దారి

- పంటక్షేత్రంలోనే ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణం
- చిన్నపాటి వానకే బురదమయంగా రహదారి
- ప్రహరీ లేక కళాశాలలోకి విష పురుగులు, పశువుల సంచారం
- స్థలానికి హద్దులు కేటాయించకపోవడంతో ఆక్రమణకు గురవుతున్న వైనం

చందుర్తి: గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద విద్యార్థులకు ప్రభుత్వ జూనియర్ కళాశాలను అందుబాటులో ఉండేలా 2008లో దివంగత సీఎం వైఎస్సార్ హయాంలో మండలకేంద్రానికి ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరైంది. పక్కాభవనం లేకపోవడంతో తొమ్మిదేళ్లపాటు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోనే కళాశాల కొనసాగింది. ఉదయం పాఠశాల విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తే, కళాశాల విద్యార్థులకు మధ్యాహ్నం నిర్వహించారు. ఒక్కపూట తరగతులతో పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గుతోందని భావించిన అప్పటి ప్రభుత్వం 2013లో ప్రభుత్వ జూనియర్ కళాశాలకు మండలకేంద్రం శివారులోని 3.10 ఎకరాల స్థలం కేటాయించారు. కళాశాల పక్కా భవనానికి ప్రభుత్వం రూ.1.19 కోట్లు మంజూరుచేయడంతో 2016లో భవన నిర్మాణం పూర్తిచేయగా 2017లో పక్కా భవనంలోకి కళాశాలను మార్చారు.

చిన్నపాటి వానకే చిత్తడి..

కళాశాల భవనాన్ని పంటక్షేత్రాల్లో ఉన్న భూమిలో కేటాయించగా రోడ్డువేయడం మరిచారు. చిన్నపాటి వానకే కళాశాల దారి పొడవునా బురదమయంగా మారడంతో కాలుతీసి వేయలేని పరిస్థితి. కళాశాల వరకు సీసీరోడ్డు వేయాలని కోరినా అది కలగానే మిగులుతోంది. ప్రహరీని నిర్మించకపోవడంతో కళాశాల ఆవరణలోకి విష పు రుగులు, పశువులు సంచరిస్తున్నాయి. దీంతో వి ద్యార్థులు, అధ్యాపకులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

ఆక్రమణకు గురవుతున్న స్థలం

కళాశాల నిర్మాణం సమయంలో 3.10 ఎకరాల స్థలాన్ని కేటాయించగా రెవెన్యూ అధికారులు హద్దులు ఏర్పాటు చేయకపోవడంతో చుట్టుపక్కల రైతులు స్థలాన్ని కబ్జాకు పాల్పడుతున్నారన్న ఆరోపణలున్నాయి. స్థానిక ప్రజాప్రతినిధులకు కళాశాల అధ్యాపక బృందం పలుసార్లు విన్నవించినా పట్టించుకోకపోవడంతో ఎకరం పైగా ఆక్రమణకు గురైనట్లు స్థానికులు తెలుపుతున్నారు. హద్దులు నిర్ణయించి, ప్రహరీ నిర్మిస్తేం స్థలం ఆక్రమణకు గురికాదని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులకు 30కి పైగా డెస్కులను వేములవాడ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏనుగు మనోహర్ రెడ్డి అందించారు. కళాశాలలో విద్యార్థుల సంఖ్య 200 పైగా ఉండగా అందుకనుగుణగా ప్రభుత్వం ఏర్పాట్లపై దృష్టిసారించాలని పలువురు కోరుతున్నారు.

బస్సులు లేక ఇబ్బంది

నర్సింగాపూర్, ఆశిరెడ్డిపల్లె, రామన్నపేట, తిమ్మాపూర్ గ్రామాల విద్యార్థుల కోసం వేములవాడ ఆర్టీసీ డిపో సహకారంతో బస్సు నడిపిస్తున్నారు. సనుగుల, రామరావుపల్లె, కిష్టంపేట, జోగాపూర్ గ్రామాల విద్యార్థుల కోసం మండలకేంద్రం వరకు బస్సు నడిపిస్తే ఈ ప్రాంత విద్యార్థులకు రాకపోకలకు ఇబ్బందులు తీరుతాయి. కళాశాల ఏర్పాటు చేసిన విద్యా సంవత్సరం నుంచి ఫలితాల్లో ముందంజలో ఉందని, గత ఫలితాలను గమనిస్తే అర్థమవుతోందని పలువురు పేర్కొంటున్నారు.

సీసీరోడ్డు వేయాలి



కళాశాలకు మట్టిదారి ఉండటంతో చిన్నపాటి వర్షానికే దారంతా బురదమయంగా మారుతోంది. దీంతో కళాశాలకు వెళ్లిరావడం ఇబ్బందిగా ఉంది. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి కళాశాల వరకు సీసీరోడ్డు వేయాలి.

– పిట్టల ఆకాంక్ష, ఇంటర్ ద్వితీయ సంవత్సరం, చందుర్తి

వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేయాలి



కళాశాలలో 200మందికి పైగా విద్యార్థులు ఉన్నారు. తాగునీటి సమస్య ఉండగా ఆటోకు కిరాయి చెల్లిస్తూ ప్యూరిఫైడ్ వాటర్ తెప్పిస్తున్నాం. ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్‌కు నిధులు మంజూరు చేయాలని అధికారులను కోరాం. దాతలు ప్లాంట్ ఏర్పాటుకు సహకరించాలి.

– మాద్గుల కృష్ణాకర్, అధ్యాపకుడు, చందుర్తి

సమస్యలు పరిష్కరించాలి



కళాశాలకు సీసీరోడ్డు వేయించి కేటాయించిన స్థలానికి అధికారులు హద్దులు ఏర్పాటు చేయాలి. ప్రహరీ నిర్మిస్తే కళాశాల ప్రాంగణం పరిశుభ్రంగా ఉండటంతోపాటు విష పురుగులు, పశువుల సంచారం ఉండదు. అధికారులు సమస్యలు పరిష్కరించాలి.

– మల్లేశం, కళాశాల ప్రిన్సిపాల్

గంజివాగు కల్వర్టుపై రాకపోకలు నిలిపివేత



కల్వర్టు పరిసరాల్లో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

బోయినపల్లి: మండలంలోని స్తంభంపల్లి గంజివాగు లో లెవల్ కల్వర్టు స్థానంలో హైలెవల్ వంతెన నిర్మిస్తున్నందున వాహనాల రాకపోకల కోసం తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రహదారిపై ఆదివారం రాకపోకలు నిలిపివేశారు. రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు హై లెవల్ బ్రిడ్జి పరిసరాల్లోని తాత్కాలిక రోడ్డు బీటలువారి పైపులు కొట్టుకుపోయే ప్రమాదం ఉన్నందున రోడ్డుపై రాకపోకలు నిలిపివేసినట్లు ఎంపీడీవో బీమా జయశీల తెలిపారు. వంతెన పరిసరాలను ఎంపీడీవో పరిశీలించారు. వేములవాడ వెళ్లేందుకు రాకపోకలకు ఇబ్బంది కలిగింది. బూర్గుపల్లి–ఎన్నంపల్లి పరిసరాల్లో ఉన్న కల్వర్టు వద్ద చెత్తను తొలగించే పనులు పర్యవేక్షించారు. నర్సింగాపూర్, వెంకట్రావుపల్లి, కొత్తపేట, మాన్వాడ, కొదురుపాక, బోయినపల్లి, బూర్గుపల్లి గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో వర్షాలతో ఇబ్బంది కలుగకుండా చర్యలు చేపట్టాలని ఎంపీడీవో ఆదేశించారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న రైతులు, నాయకులు

కోనరావుపేట: రైతులకు రూ.లక్షలోపు మాఫీ చేయడాన్ని హర్షిస్తూ శ్రీ రాములపల్లి (మామిడిపల్లి) లో రైతులు, కాంగ్రెస్ నాయకులు ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే, ప్రభుత్వ ఆది శ్రీనివాస్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో సాసాల రాజారాం, మల్లారెడ్డి, శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ ఎల్లాల రాంరెడ్డి, కొక్కుల నర్సయ్య, గుండెకార్ల ప్రసాద్, సంజీవరావు, శంకర్‌రావు, గుమ్మడి అమృతరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైకి సన్మానం



ముస్తాబాద్: ముస్తాబాద్ ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన చిందం గణేశ్‌ను పద్మశాలీ సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. శాంతి భద్రతల పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా ఎస్సై కోరారు. కార్యక్రమంలో మండల సంఘం అధ్యక్షుడు గూడూరి భరత్, పట్టణాధ్యక్షుడు తడుక బాలకిషన్, బిట్ల నందం, ప్రశాంత్, శ్రీకాంత్, తుమ్మ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల కాపరులు జాగ్రత్తలు పాటించాలి

తంగళ్లపల్లి: వర్షాకాలంలో గొర్రెల కాపరులు జాగ్రత్తలు పాటించాలని యాదవ హక్కుల పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షుడు మిరాల శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసినప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. భారీ వర్షం కురిస్తే గుట్టలపై ఉండకూడదని, అత్యవసరమైతే తప్ప ఇంట్లోంచి బయటకు వెళ్లొద్దని సూచించారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

తంగళ్లపల్లి: ఇల్లంతకుంట మండలంలో సోమవారం మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పర్యటించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూంపల్లి రాఘవ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు పెద్దలింగాపూర్‌లో వీరనారి చిట్యాల ఐలమ్మ విగ్రహం ఆవిష్కరించి, 1:30 గంటలకు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, ప్రజలు పాల్గొనాలని కోరారు.

రోడ్లన్నీ గుంతలమయం



వేములవాడ : ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు వేములవాడలోని రోడ్లన్నీ గుంతలమయంగా మారాయి. సెస్ కార్యాలయం ముందున్న రోడ్డు దెబ్బతిని అధ్వానంగా మారింది. దీంతో వాహనదారులు గుంతల్లోపడి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అధికారులు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



తంగళ్లపల్లి: మండలంలోని దేశాయిపల్లె గ్రామ శివారులోని మానేరువాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఆదివారం పట్టుకున్నట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. ట్రాక్టర్ ఓనర్ దాసరి రాజుపై కేసు నమోదుచేసి సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

నలుగురిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లగొల్లపల్లి, ఎల్లారెడ్డిపేటలో ఆదివారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. మద్యంతాగి వాహనాలు నడిపిన నలుగురిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు చేశారు. ఎస్సై రమాకాంత్ మాట్లాడుతూ.. వాహనదారులు సరైన ధ్రువపత్రాలు కలిగి ఉండాలన్నారు. నంబర్ ప్లేట్ లేని వాహనాలు నడిపితే వాహనాలు సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామన్నారు. తనిఖీల్లో ఏఎస్సై కిషన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా బోనాలు



గంభీరావుపేట: బోనాలతో ఆలయానికి తరలివెళ్తున్న మహిళలు



తంగళ్లపల్లిలో..

గంభీరావుపేట: మండలకేంద్రంలో అషాఢ మాసం సందర్భంగా ఆదివారం మహంకాళి అమ్మవారి బోనాల పండుగను నిర్వహించారు. మహిళలు బోనాలతో ఆలయానికి ఊరేగింపుగా తరలివెళ్లి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. తంగళ్లపల్లి మండలకేంద్రంలోని ఇందిరానగర్ లో పోచమ్మ బోనాలు నిర్వహించారు. మహిళలు నెత్తిన బోనాలతో డప్పుచప్పుళ్ల మధ్య ఆలయానికి ఊరేగింపుగా తరలివెళ్లారు. నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

‘జూకంటి’కి అవార్డు రావడంపై హర్షం

ఎల్లారెడ్డిపేట: జూకంటి జగన్నాథం గొప్ప కవి అని తెలంగాణ వివేక రచయితల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు వాసరవేని పర్శరాములు అన్నారు. జగన్నాథంకు రాష్ట్ర ప్రభుత్వ దాశరథి పురస్కారం ప్రకటించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జగన్నాథం పాతాళగరిగ, ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, గంగడోలు, బొడ్డుతాడు, తల్లికొంగు, తారంగం, చిలుక రహస్యం, సద్దిముల్లె, పాస్, ఊరు ఒక నారుమడి లాంటి కథలు, 20 వరకు పుస్తకాలు రచించారన్నారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో టీజేఏసీ చైర్మన్‌గా రాష్ట్ర సాధనలో తన వంతు పాత్ర పోషించారన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపెన రమేశ్, కవులు బారా ధన్‌రాజు, నీలకంఠం, ప్రభాకర్, మహేందర్, రాజయ్య తదితరులున్నారు.

బోయినపల్లి: సిరిసిల్లకు చెందిన ప్రముఖ కవి, రచయిత జూకంటి జగన్నాథంకు దాశరథి కృష్ణమాచార్యులు అవార్డు రావడంపై సెస్ డైరెక్టర్, జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యుడు కొట్టెపెల్లి సుధాకర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం సుధాకర్ జూకంటి జగన్నాథంను కలిసి ఘనంగా సత్కరించారు. ఆయన వెంట బూర్ల వెంకన్న, దూస అశోక్, ఆడెపు లక్ష్మణ్ ఉన్నారు.

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు



రుద్రంగిలో పల్లకీసేవలో పాల్గొన్న భక్తులు



ఎల్లారెడ్డిపేటలో పండితులను సన్మానిస్తున్న నాయకులు

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం గురు పౌర్ణమి సందర్భంగా సాయి ఆలయాల్లో పూజలు చేశారు. స్వామివారికి పాలాభిషేకం నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు. వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హన్మాజిపేట గ్రామంలో సాయిబాబాను దర్శించుకొని పూజలు నిర్వహించారు.

ముస్తాబాద్: మండలకేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో రాజుగురుస్వామిని శిష్య బృందం ఘనంగా సన్మానించింది. గురువులను గౌరవించే సంప్రదాయం గొప్పదని పలువురు పేర్కొన్నారు.

బోయినపల్లి: వరదవెల్లి గుట్టపై స్వయంభూగా వెలసిన శ్రీ గురు దత్తాత్రేయస్వామి ఆలయంతో పాటు, తడగొండ, ఎన్నంపల్లి సాయి ఆలయాల్లో గురుపౌర్ణమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఎల్లారెడ్డిపేట: మండలంలోని పలు ఆలయాల్లో గురుపూజోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో పండితులు ప్రత్యేక పూజలు చేశారు. మండలకేంద్రంలోని సత్సంగ సదనంలో భక్త శ్రీ సరస్వతి గోవిందా రాజు విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసి గురుపూజోత్సవం నిర్వహించారు. గ్రామ పురోహితులు హన్మండ్ల శర్మ, బ్రహ్మచారి లక్ష్మారెడ్డి, గుండయ్య శర్మను సన్మానించారు. ఈ సందర్భంగా సదనం అధ్యక్షుడు లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. తల్లిదండ్రుల తర్వాత గురువు ప్రముఖ స్థానం అన్నారు. భక్త సంఘం ప్రతినిధులు సంజీవ రెడ్డి, వెంకట్‌రెడ్డి, బండారి బాల్‌రెడ్డి, సనుగుల ఈశ్వర్, నంది కిషన్, వెంకటేశ్ గౌడ్, రాంరెడ్డి, వేద పండితులు పాల్గొన్నారు.

రుద్రంగి: గురుపౌర్ణమి సందర్భంగా మండలకేంద్రంలోని సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా సాయిబాబా పల్లకీ సేవ నిర్వహించారు. భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

వంతెన వద్ద సీసీరోడ్డు వేయాలి



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కేకే మహేందర్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాగట్లపల్లి శివారులోని రాపెల్లి వాగువద్ద వంతెనకు ఇరువైపులా రక్షణ కోసం శాశ్వత నిర్మాణ పనులు చేపట్టాలని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. ఏడాదిగా వంతెన నిర్మాణం పూర్తయినా ఇరువైపులా గుంతలతో ప్రయాణికులకు ఇబ్బందిగా మారిందని కాంగ్రెస్ నాయకులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన మహేందర్‌రెడ్డి ఆర్‌అండ్‌బీ డీఈ నాగరాజుకు విషయాన్ని వివరించి ఇరువైపులా సీసీరోడ్డు వేయాలన్నారు. వీర్నపల్లి మండలకేంద్రంలో వేస్తున్న సీసీరోడ్డుకిరువైపులా డ్రైనేజీ నిర్మించాలన్నారు. దుమాలకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు ఉల్లి మహేశ్ కేకే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కే గౌస్, మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు బాలకిషన్, మందాటి దేవేందర్ యాదవ్, మెండే శ్రీనివాస్, నంది కిషన్, బాలాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని పలు సమస్యలను పరిష్కరించాలని మాజీ ఎంపీటీసీ, కాంగ్రెస్ నాయకుడు ఒగ్గు బాల్‌రాజ్‌యాదవ్ ఆదివారం నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డికి వినతిపత్రం అందించారు. కిష్టంపల్లిలోని పల్లె దవాఖానాకు చుట్టు ప్రహరీ, బోర్ మోటార్, జెడ్పీ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కేంద్రానికి మూత్రశాలల నిర్మాణం, మురుగుకాలువల మరమ్మతు పనులకు నిధులు మంజూరుచేసేలా చూడాన్నారు. వెంటనే సంబంధితశాఖల అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని మహేందర్‌రెడ్డి సూచించారు.



వేములవాడ అర్బన్ : సమావేశమైన 1988 - 89 పదో తరగతి విద్యార్థులు



ముస్తాబాద్ : 2008 - 09 ఎస్సెస్సీ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



బోయినపల్లి: సమ్మేళనంలో పాల్గొన్న 2003 - 04 బ్యాచ్ విద్యార్థులు

వేములవాడఅర్బన్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1988–89లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నాంపల్లిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. పాఠశాలలోని చదివిన అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం గురువులను ఘనంగా సన్మానించారు. మహేశ్, కిషోర్‌రావు, మదన్‌మోహన్, సత్యం, రాణి పాల్గొన్నారు.

ముస్తాబాద్: ముస్తాబాద్ జెడ్పీ ఉన్నత పాఠశాల 2008–09 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థుల పూర్వ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. పూలమాలలు, శాలువాలతో సత్కరించారు.

బోయినపల్లి: బోయినపల్లి హైస్కూల్‌లో 2003–2004 లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఆటపాటలతో రో జంతా ఆనందంగా గడిపారు.

పేదలకు అన్నదానం

వేములవాడ: వేములవాడ రాజన్న గుడిమెట్ల వద్ద భక్తులు, నిరుపేదలకు మై వేములవాడ ట్రస్ట్ ప్రతినిధులు ఆదివారం అన్నదానం చేశారు. గత 1182 రోజులుగా అన్నదానం కొనసాగుతుందని ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు.